ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది

- శ్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులకు అర్థమయ్యేలా పాఠాలు
- బొమ్మలు, ఆటపాటలతో బోధన


అంగన్‌వాడీ కేంద్రంలో బొమ్మలతో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు లావణ్య

హిందూపురం టౌన్: ప్రీ ప్రైమరీ విద్య నాణ్యంగా అందితే పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా రూపుదిద్దుకున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించడానికే పరిమితమయ్యేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

ఆకట్టుకునేలా బోధన

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేసింది. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వారిలో అవగాహన పెంపొందించే విధంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. చిన్నారులకు అవసరమైన కిట్లను ప్రభుత్వం సమకూర్చడంతో పాటు ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులకు ఇంగ్లిష్ బోధించేందుకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ నూతన విధానంలో చిన్నారులకు ఇంగ్లిష్, మాథ్స్, వర్క్ బుక్స్, యాక్టివిటీ పుస్తకాలను అందించారు. చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలతో పుస్తకాలను తయారు చేశారు. వివిధ రకాల బొమ్మలు, ఆటపాటలతో బోధన సాగుతోంది. ఇంగ్లిష్ అక్షరాలు, అంకెలు పలకడం కోసం స్పోకెన్ ఇంగ్లిష్ వర్క్‌బుక్‌లో అక్షరాలను పొందుపరిచారు. గణిత వర్క్‌బుక్‌లో ఒకటి నుంచి పది అంకెల వరకూ పరిచయం, యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, బొమ్మలకు రంగులు వేయడం వంటి అంశాలను చేర్చారు.

హిందూపురం ప్రాజెక్టు పరిధిలో

హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉండగా మొత్తం 330 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ వర్కర్లుగా 293 మంది, హెల్పర్లుగా 289 మంది, మినీ అంగన్‌వాడీ వర్కర్లుగా 36 మంది పనిచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఆరేళ్లలోపు చిన్నారులు 15,707 మంది ఉండగా 10వేల మంది దాకా చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విద్యా విధానం చిన్నారులకు పూర్వ ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియంపై ఆసక్తిని పెంచుతోంది.

ఆటపాటలతో బోధన



మూడు, నాలుగేళ్ల పిల్లలకు బొమ్మలు, ఆటపాటలతో బోధన చేస్తే సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. పాఠాలను పాటల రూపంలో చెప్పడంతో వారు అలవోకగా నేర్చుకునే అవకాశముంది. ఆ విధంగా వారికి విద్యలో బలమైన పునాది వేస్తున్నాం. అలాగే చిన్నారులకు వయసుల వారీగా రెండు తరగతులుగా విభజించి అర్థమయ్యేలా బోధిస్తున్నాం.

– రెడ్డి రమణమ్మ, సీడీపీఓ, హిందూపురం

ఉనికి కోసమే టీడీపీ బృందం పర్యటన

- ఇప్పటికే నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిన ప్రభుత్వం
- బాబు హయాంలో వరుస కరువుతో ప్రజల ఇక్కట్లు
- అప్పట్లో కరువును పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: రాజకీయ ఉనికి కోసమే టీడీపీ కరువు బృందం పర్యటన తలపెట్టిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి విమర్శించారు. మడకశిర ప్రాంతంలో సోమవారం రాష్ట్రస్థాయి టీడీపీ నాయకులు కరువు పరిశీలనకు వస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కరువు పరిస్థితులను గుర్తించి నియోజకవర్గంలోని ఐదు మండలాలను కూడా కరువు ప్రాంతంగా ప్రకటించారన్నారు. ఈవిషయాన్ని టీడీపీ నాయకులు గుర్తంచకుండా కరువు పరిశీలన పేరుతో రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. కరువు పరిశీలన పేరుతో హడావుడి చేయడం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఏడాది మాత్రమే వర్షాభావ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఏ మాత్రం జాప్యం చేయకుండా కరువు ప్రాంతంగా గుర్తించిందని తెలిపారు. కరువు పరిస్థితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు, ప్రజలను అన్ని విధాలుగా ప్రభుత్వం అదుకుంటుందని తెలిపారు. టీడీపీ నాయకులు ఈ విషయాన్ని గుర్తించి కరువు రాజకీయం చేయడం మానుకోవాలని కోరారు. చంద్రబాబు హయాంలో వరుస కరువులు వచ్చాయని తెలిపారు. అయినా ఆరోజు చంద్రబాబు కరువును పట్టించుకోలేదని విమర్శించారు. ఈ రోజు టీడీపీ నాయకులు కరువు పరిశీలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లడానికి ప్రయత్నాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు కరువు రాజకీయాన్ని మానుకొని ప్రభుత్వానికి తగిన సలహాలు ,సూచనలు అందించి కరువు నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు.

మాదిగల విశ్వరూప మహాసభకు రండి

ఈనెల 11న హైదరాబాద్‌లో మందకృష్ణ తల పెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు రావాలని ఎంఈఓ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని కోరారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి స్వగృహంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, స్థానిక నాయకులు డాక్టర్ శివన్న, రామకృష్ణ, రంగప్ప మాట్లాడుతూ మహాసభకు భారత ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని, మీరు కూడా తప్పకుండా హాజరు కావాలని కోరారు. తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు, స్థానిక నాయకులు, శ్రీరామ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ కార్యదర్శి మధు

లేపాక్షి: ఎస్సీ వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఈనెల 11న మాదిగ, ఉపకులాలు తలపెట్టిన విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి మధు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక లేపాక్షి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వరూప మహా సభ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభకు ప్రధాని మోదీ హాజరవుతారన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ, ఉపకులాల అభ్యున్నతి సాధ్యమన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతు మాదిగల విశ్వరూప మహాసభకు ప్రతి జిల్లా, మండలం నుంచి మాదిగలు తరలిరావాలన్నారు. సర్పంచ్ ఆదినారాయణ, కదిరి తాలుకా ఎంఈఎఫ్ అధ్యక్షుడు ఆదినారాయణ, రాష్ట్ర కౌన్సెలింగ్ సభ్యుడు నాగరాజు, స్థానిక నాయకులు నారాయణప్ప, ఎంఆర్ నరసింహప్ప, రాజు, శివ, రమణ, అన్నప్ప, ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

స్మారకాల పరిరక్షణకు కృషి చేద్దాం


మాట్లాడుతున్న అకాడమీ అధ్యక్షుడు దేవర కొండారెడ్డి

పావగడ: స్మారకాల పరిరక్షణకు కృషి చేద్దామని స్థానిక చరిత్ర పరిశోధకుడు డా చెలువరాజన్ తెలిపారు. స్థానిక ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడారు. భావి తరాలు సైతం స్మరించుకునేలా చారిత్మాత్మక శిలా శాసనాలు, వీరగల్లులు, కోటలు నశించి పోకుండా కాపాడు కోవాలన్నారు. కర్ణాటక ఇతిహాస అకాడమీ అధ్యక్షుడు డా దేవరకొండారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు జరిగే 37వ వార్షిక రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలన్నారు. గ్రామాల్లో లభించే ప్రాచీన ఆలయాలు, కోటలు, శిలా శాసనాలను గుర్తించి అకాడమి దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు. అకాడమీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఎస్‌ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావ్, కార్యదర్శి సుబ్బనరసింహ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నీరు సమృద్ధిగా లభించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

మడకశిరరూరల్: ఆర్ అనంతపురం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టామని సర్పంచ్ అంజినమ్మ తెలిపారు. రేకులకుంటలోని వాటర్ స్కీమ్ బోరులో అరకొరగా నీరు వస్తుండడంతో జేజేఎం పథకం కింద ఆదివారం కొత్తగా బోరు తవ్వారు. అందులో అడుగుల లోతులో దాదాపు మూడించుల నీరు లభించినట్లు సర్పంచు తెలిపారు. బోరులో నీరు సమృద్ధిగా లభించడంతో మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా కొత్తగా బోర్లు వేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపాన అటంతః ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు ఆలయాన్ని నీటితో శుభ్రం చేసి మూల విగ్రహాన్ని పూలతో అలంకరణ చేశారు. అర్చకుడు స్వామి మూల ప్రతిమకు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళహారతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయ అవరణలో వంటకాలు చేసి స్వామికి సమర్పించారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థల పరిశీలన


సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని ఎం.కొత్తపల్లి, దొడగట్ట గ్రామ పరిధిలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణానికి స్థలం పరిశీలించినట్లు ఎంపీపీ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. వ్యవసాయ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రెండు గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణం పూర్తయితే లోఓల్టేజీ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

రొళ్ల: రొళ్లకొండ గ్రామానికి చెందిన రైతు సీభన్న వ్యవసాయ బోరుబావికి అమర్చిన 100 మీటర్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు.

నార్పల జట్టు విజయం


సెంచరీ చేసిన స్వాతి

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన అండర్ -15 బాలికల క్రికెట్ పోటీలో నార్పల జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 30 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 369 పరుగులు చేసింది. ఈ జట్టులో స్వాతి అనే క్రీడాకారిణి 68 బంతుల్లో 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పెనుకొండ జట్టు 90 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

సజావుగా ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలనం


పథ సంచలనం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

పావగడ: పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘం కార్యకర్తలు ఆదివారం నిర్వహించిన పథ సంచలన కార్యక్రమం సజావుగా సాగింది. ఈ సందర్భంగా సుమారు 70 మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం 3.30 గంటలకు గురుభవన్ మైదానంలో ప్రారంభమైన సంచలనం ప్రధాన రహదారుల్లో సాగి ఎస్‌ఎస్‌కే సముదాయ భవనం వద్ద ముగిసింది.

జవాన్‌కు సత్కారం


పదవీ విరమణ పొందిన జవాన్ అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న యువకులు

హిందూపురం టౌన్: బీఎస్‌ఎఫ్‌లో సైనికుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన హిందూపురం చేరుకున్న అరుణ్‌కుమార్‌ను పట్టణ యువకులు ఘనంగా సత్కరించారు. స్థానిక లక్ష్మీపురానికి చెందిన అరుణ్‌కుమార్ బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా దేశం కోసం 21 సంవత్సరాలు సేవలందించి అక్టోబర్ 31న పదవీ విరమణ పొందారు. ఆయన ఆదివారం హిందూపురం చేరుకోవడంతో లక్ష్మీపురం యువకులు, పలువురు రైల్వేస్టేషన్‌లో అరుణ్ కుమార్‌కు స్వాగతం పలికి సత్కరించారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్ ఎన్.నరసింహులు

ధర్మవరం అర్బన్: బస్సులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అందించి నిజాయితీ చాటుకున్నారు ఆర్టీసీ కండక్టర్. ధర్మవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఎన్.నరసింహులు ఆదివారం గోరంట్ల బస్సు సర్వీసుకు వెళ్లారు. కొత్తచెరువుకు చెందిన ప్రయాణికురాలు గోవిందమ్మ తన సెల్‌ఫోన్‌ను బస్సులో పోగొట్టుకుంది. సెల్‌ఫోన్ తీసుకున్న కండక్టర్ అందులోని ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి, ప్రయాణికురాలు గోవిందమ్మ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న విషయాన్ని తెలియజేశారు. అనంతరం ఆమె కుమారుడు పవన్‌కుమార్‌ను ఆర్టీసీ డిపోకు పిలిపించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, డిపో ఏడీసీలు మాధవ్, టీఎస్ మూర్తి సమక్షంలో అతడికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను ఉద్యోగులు అభినందించారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రజారక్షణ భేరి పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీ టీడీపీ కూడా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయకుండా స్వార్థ రాజకీయాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, రాజ్‌గోపాల్, చాంద్ బాషా, నారాయణ స్వామి, వెంకటేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ నైట్ వాచ్‌మెన్ మృతి


మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం


వెంకటేశులు(ఫైల్)

మడకశిర: మడకశిర మండల పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వెంకటేశులు(55) అనారోగ్యంతో ఆదివారం పట్టణంలోని తన స్వగృహంలో మృతి చెందాడు. దహన సంస్కారాలకు ప్రభుత్వం తరఫున మండల పరిషత్ అధికారులు రూ.25వేలను మృతుడి భార్య లలితమ్మకు అందించారు. నైట్‌వాచ్‌మెన్ మృతికి ఎంపీడీఓ సోనిబాయి, కార్యాలయ సిబ్బంది, అధికారులు సంతాపం తెలియజేశారు.

‘ప్రతిభా’వంతుడు


విక్రం ల్యాండర్ నమూనాతో భవాని ప్రసాద్

పావగడ: తాలూకా స్థాయి ప్రతిభా కారంజి పోటీల్లో స్థానిక శనిమహాత్మ ఆలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి భవానిప్రసాద్ విక్రం ల్యాండర్ నమూనాను ప్రదర్శించి ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక బీఈఓ ఇంద్రాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికి తీసి గుర్తించేందుకు ప్రతిభా కారంజి పోటీలు వేదికగా మారడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మారుతేశ్, ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, బీఆర్పీ జి వెంకటేశ్, ఈసీఓ వేణు గోపాలరెడ్డి, సీఆర్పీ శివమూర్తి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

మడకశిర: విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ తలపెట్టినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు నవీన్‌కుమార్, అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌సంస్థలకు ధారదత్తం చేస్తోందన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులుగా మారుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. కేంద్రం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకుని త్వరితగతిన కడపలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నందకుమార్, ఉపేంద్ర, కోన విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్


పోలీసులో అదుపులో ఉన్న జూదరులు

పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న 9మంది వ్యక్తులను,ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 42 వేలు నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

రోగులకు అన్నదానం

పెనుకొండ: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలు, యాచకులు, వృద్ధులకు అన్నదానం చేశారు. నారాయణసేవలో భాగంగా భజన మండలి సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూవివాదంలో మహిళపై దాడి

రొళ్ల: భూవివాదంపై జరిగిన ఘర్షణలో ఓ మహిళపై దాడి జరిగింది. ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపిన వివరాలు..రత్నగిరి గొల్లహట్టి చెందిన రంగలక్ష్మి తన పొలం వద్ద పొలం పనులు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో పాటు అతని కుటుంబ సభ్యులు, మరో ఐదుగురు వచ్చి ఈ పొలం తమదని, తాము సాగు చేసుకుంటామని గొడవకు దిగారు. తర్వాత ఇక్కడి నుంచి వెళ్లాలని చెబుతూ ఆమెపై కట్టెలతో దాడి చేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

పావగడ: స్థానిక శారదదేవి కంటి ఆస్పత్రిలో సోమవారం చిన్న పిల్లల కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు స్వామి జపానంద ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మింటో ఆస్పత్రి, నారాయణ కంటి ఆస్పత్రి సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లల దృష్టిలోపం, తలనొప్పి, మెల్లకన్ను, కంటి పొర, కంటిలో నీరు, పిసరు కారడం వంటి రుగ్మతలకు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా వసుధ నరేశ్ చికిత్స అందిస్తారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 3.30 వరకు శిబిరం కొనసాగుతుందని వివరించారు.

ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన


రొళ్ల మండలం రత్నగిరిలో ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 బూత్ కేంద్రాల్లో రెండో రోజు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్‌ఐ మంజునాథ్ ఎం.రాయాపురం, హునిసేకుంట, హెచ్‌టీ హళ్లి, బీజీ హళ్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

అగళి: మండల వ్యాప్తంగా 29 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. అగళి, ఎంఎం పాళ్యం, నరసంబుది తదితర పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక నమోదును డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, ఆర్‌ఐ గుర్రన్న, సీనియర్ అసిస్టెంట్ విన్ సైన్ జాన్ పాల్ పరిశీలించారు.

10న మండల సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహానాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న వలంటీర్ చంద్రశేఖర్

అమరాపురం: వి.అగ్రహారం గ్రామానికి చెందిన బిఎస్.మూర్తి అనారోగ్యంతో బెంగళూరులోని సప్తగిరి ఆసుపత్రిలో చేరాడు. వలంటీర్ చంద్రశేఖర్ పింఛన్ ఇవ్వడానికి మూర్తి ఇంటి వద్దకు వెళ్లగా ఆసుపత్రికి వెళ్లారని పొరుగింటి వారు తెలియజేశారు. దీంతో వలంటీర్ ఆదివారం 185 కిలో మీటర్ల దూరంలో ఉన్న బెంగళూరుకు సొంత ఖర్చులతో వెళ్లి మూర్తికి వృద్ధాప్య పింఛన్‌ను అందించాడు.

రొళ్లలో మోస్తరు వర్షం

రొళ్ల: మండల వ్యాప్తంగా ఆదివారం మోస్త రు వర్షం కురిసింది. సాయంత్రం 5.45 గంటల నుంచి 6.45 వరకూ వానపడింది. దాదాపు 3 నెలల తర్వాత వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్

పెనుకొండ: యూటీఎఫ్ మండల కమిటీని ఆ శాఖ నాయకులు ఆదివారం ఎంపిక చేశారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ రెసిడెన్సీలో యూటీఎఫ్ శ్రీసత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కృష్ణానాయక్, అధ్యక్షుడిగా ఉపేంద్ర, ప్రధాన కార్యర్శిగా రమేష్, సహ అధ్యక్షులుగా రామాంజనేయులు, కోశాధికారిగా ఆదిదినేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

సీఎం సభ విజయవంతం చేయండి

రొళ్ల: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర కోరారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పది పంచాయతీల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఉదయం 7 గంటలకు మండల కేంద్రం నుంచి సభకు బయలు దేరుతామన్నారు. అన్ని పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు సభకు తరలిరావాలని కోరారు.